# అసుర సంధ్య

## శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

[గత సంచిక తరువాయి]

శ్రీధర్ తను రానన్నాడు. "మామా, యీ విషయంలో నామంచీ చెడ్డ నాకు తెలుసు.. ఆడవాళ్ళు పుట్టింటికి వెళ్ళి వచ్చేందుకు ఏదో గొడవ చేస్తూనే ఉంటారు. వెళ్ళనియ్యి.." అన్నాడువిసుగ్గా.

"నీకాపురం పాడవుతుందయ్యా అంటే నీకు బొత్తిగా పట్టకుండా వుందేం?" అన్నాడు ఓబయ్య కంఠం హెచ్చిస్తూ.. ఓబయ్య ధోరణి చూస్తే నలుగురు టీచర్లనీ పిలిచి స్కూల్లో ఒక చిన్న 'సీను' తయారు చేసేలా అనుమానం కలిగింది శ్రీధర్‌కు.

"ఉండు మామా! ఒక సంగతి. ఆకొాలు లెక్కల మాటేం చేశావ్? గొలుసు విడిపించటానికి తెచ్చిన ఋణం బాపతు వడ్డీ పెరుగుతూ ఉంది; ఆఋణం ఎలా తీరుతుంది?నువ్వేమో ఉలకవూ పలకవూ! నాకు వచ్చేజీతం యిల్లు జరగటానికి సరిపోతుంది. వెళ్ళనీ ఏదో కాస్త వెనకేసుకువీ ఋణమైనా తీర్చుకుంటాను. అదీ అభిప్రాయం. లేకపోతే నువ్విప్పుడది సర్దుతావేమో చెప్పు." అన్నాడు శ్రీధర్, ఎక్కడ నొక్కాలో అక్కడ నొక్కుతూ.

"ఓ దానికేం, సర్దవచ్చును! ఆలోచిద్దాంలే!అయితే తారను పుట్టింటికి వెళ్ళనిమ్మంటావా?ని న్నడిగి చివరిమాటగా తెలుసుకుందామని వచ్చాను" ఓబయ్య చప్పబడి పోయాడు.

"నిక్షేపంగా వెళ్ళనీ."

ఓబయ్య వెళ్ళి పోయాడు. శ్రీధర్‌కు తెలుసు: అంతకు రెండురోజులక్రితమే జీతం వస్తే తారచేతి కిచ్చేశాడు. కాబట్టి రైలు చార్జీలకు లోటు లేదు.తార తనపంతం నెరవేర్చుకోవాలంటే నెరవేర్చుకోనీ! బహుశా ఓబయ్య మామ రేణిగుంట దాకా వెళ్తాడు.!

తార పుట్టింటికి వెళ్ళి పోయాక వారం రోజులికి రుక్మిణమ్మా నరసింహులూ శ్రీధర్‌కీ కబురు పెట్టారు. తండ్రిని జ్ఞాపకంతెచ్చి వంశం పేరు ప్రతిష్ఠల్ని నిలబెట్టటం యిద్దరిమీదా సమానంగా ఉందనీ చదువుకున్న వాడైన శ్రీధర్ మీద మరీ ఎక్కువగా ఉందనీ, శ్రీధర్ ప్రవర్తనను గూర్చి వింటున్న సంగతులు ఏమీబాగులేవనీ, తారనూ పిల్లల్నీ పుట్టింటికి పంపించెయ్యటం శ్రేయస్సు కాదనీ నరసింహులు బోధించాడు.

## 23

తార వెళ్ళిపోవటాన్ని గూర్చి మళ్ళీ ఆత్మపరీక్ష చేసుకున్నాడు శ్రీధర్. తను ప్రత్యేకంగా నిర్వచించుకున్న 'వ్యక్తిత్వాన్ని' గూర్చి పునరాలోచించాడు. తార వెళ్ళిపోవటంలో వ్యవస్థ యిచ్చిన అధికారమా, వ్యక్తిగతమైన స్వచ్ఛంద నిర్ణయమా ఏది ప్రాధాన్యం వహించింది? తార తనను వ్యక్తిగా అర్థం చేసుకోలేదు అన్న ఆరోపణలో, అలా ఆమె చేసుకోకపోవటానికి కారణం బాధ్యత తనమీద మాత్రం లేదా? తనను గూర్చీ పద్మమణిని గూర్చీ ఆమె సవ్యంగా గ్రహించేందుకు తను చేసిన ప్రయత్నం ఏమున్నది? పద్మమణినిగూర్చి ఆమెతెలిక అన్నమాటలు సహజమే. అలా కాకపోయినా తార పద్మమణి అంటే ఈర్ష్య పడటమూ న్యాయమే! అది ఆమె లోప మెలా అవుతుంది? తను చేసిన విధంగానే ఒకవేళ తార కూడా మరొక పురుషుణ్ణి కోరితే ఏమౌతుంది? అప్పుడు భర్త అయిన తన ప్రవర్తన ఎలా ఉంటుంది? ఈ ప్రశ్నలదృష్ట్యా తను ఇదివరలో నిర్వచించుకున్న 'వ్యక్తిత్వాని'కీ, అది జీవితం మీద యిచ్చే 'అధికారాని'కీ మరింత స్పష్టమైన వ్యాఖ్యానం చేసుకోవాల్సి వస్తోంది.

జీవితం సంకీర్ణంగా వుంటుంది. పద్మమణి తోడి అనుబంధాన్ని ఎంత స్పష్టంగా తను కోరుకున్నా పిల్లల మీదా తార మీదా పూర్తిగా మమకారం తనకు పోలేదు. కాని జీవితంలో క్రియతః ఒకదాన్ని కోరుకోవటం రెండవదాన్ని వదులుకోవటమే అవుతుంది. అలాంటి పరిస్థితిలో చేసుకున్న నిర్ణయం విషయంలో గాఢమైన విశ్వాసమూ ఏకాగ్రతా కలిగి వుండటమే 'వ్యక్తిత్వాని'కి లక్షణం. అందుకే తను తారను కాదని పద్మమణి వైపు స్పష్టంగా బహిరంగంగా మొగ్గిన తర్వాత, తార తనను కాదని మరొక మగవాడివైపు మొగ్గినా తను చలించటానికి వీల్లేదు. తార అలాచేస్తే ఆ నిర్ణయం ప్రతీకార భావమో, ఈర్ష్యో అనే విషయం కూడా తన కనవసరం! తార ప్రవర్తనమీద తీర్పు యివ్వటానికి తన కేమిటి సంబంధం? ఒకసారి వివాహ వ్యవస్థను

కాదని, వ్యక్తిగతమైన అనుబంధానికి ప్రాముఖ్యత యిచ్చిన తనకు తారమీద ఏ హక్కూ లేదు! ఇంతదూరం స్పష్టంగా ఆలోచిస్తే శ్రీధర్ కేదో క్రొత్తగా భయంగా వుంది! వ్యక్తిత్వం తీసుకువెళ్ళి కూర్చోబెట్టే ఏకాంత శిఖరంమీద, సంఘమూ వ్యవస్థా యిచ్చే వెచ్చదనమూ, రక్షణా ఉండవన్న మాట!

సంభవాసంభవాల్లో నిమిత్తం లేకుండా అంతర్యంలో కోరికలూ, యిష్టానిష్టాలూ మిశ్రమంగా క్లిష్టంగా సంకీర్ణంగా వుంటాయి. ఇవి లౌకిక వ్యాపారాల్లో రూపొందే సమయమే పరీక్షా సమయం. ఇక్కడే ఆశయానికీ, ఆచరణకీ అందకుండా పొందకుండా పోతుంది. అందుకే ఆంతర్య శోధనా, బాధ్యతా యుతమైన ప్రవర్తనా వ్యక్తిత్వం ప్రస్ఫుటం కావటానికి కావలసిన నిరంతర నిత్య సాధన.

శ్రీధర్ తనలోని సందేహాలకూ, ఆలోచనలకూ స్వస్తి చెప్పాడు. అన్నా వదినెలతో, ఓబయ్యా సుంగమ్మలతో, తారతో పిల్లల్తో ఒక రకంగా తన సంబంధం తెగిపోయినట్లే. తనకు పద్మమణి, పద్మమణికి తను!

నాలుగు నెలలు గడిచాయి. బయటి ప్రపంచంతో వారికి సంబంధం క్షీణిస్తోంది. నాటక సమాజంలో వారికి ఉత్సాహం పోయింది. ఓబయ్య యింటివైపుగాని, నరసింహులి యింటి వైపుగాని వెళ్ళటం లేదు శ్రీధర్. ట్యూషన్‌లు మానివేశాడు. పద్మమణి యింట్లోనే వుంటున్నాడు. స్కూలుకు వెళ్ళటం, పుస్తక పఠనం, మిగతాకాలం పద్మమణితో గడుపుతున్నాడు. పద్మమణి బి. ఏ. తర్వాత గర్ల్స్ హైస్కూల్లో ఉద్యోగం చేస్తోంది.కాని ఆమెలో పూర్వపు ఉత్సాహం, ఆసక్తి లేవు! మాయను గూర్చి యిప్పుడెక్కువ ప్రస్తావించక పోయినా, ఆమెలో శ్రీధర్ ఒక మార్పుని గమనించాడు: ఆమె మునుపటిలా నవ్వక పోవటం! చదువుకునే రోజులనాటి ముగ్ధత్వం, చిలిపితనం, అవ్యాజమైన ఆహ్లాదం ఆమె నవ్వులో మొన్నటిదాకా తొణికిస లాడుతూ ఉండేవి. ఆ నవ్వు అతని హృదయాన్ని గిలిగింతలు పెట్టేది. ఇప్పుడామె నవ్వినా అందులో ఆ కాంతీ, ఆ స్వేచ్ఛా కనిపించవు.

"పద్మా నువ్వు మునుపటిలా నవ్వటం లేదు!"

"అందుకు కారణం నాకు మునుపటిలా నవ్వు రాక పోవటం! పెదవుల్తో నవ్వటమే మనకు సాధ్యం; నవ్వేందుకు నిరాకరించే హృదయాన్ని మనం ఏం చెయ్యగలం? మనసు మరిచినా హృదయం మరిచిపోదు దుఃఖాన్ని......"ఆమె మాటలు కూడా బరువు గానే ఉంటున్నాయి. ఈ అయిదేళ్లలో ఆమె ఎంతో మారింది. ఈ నాల్గు నెలల్లో మరీ ఎక్కువగా.....

ఒకరోజు స్కూలునుంచీ వచ్చి అన్నదామె: "నా స్నేహితు రాలు రమ యివ్వాళ అడిగింది, 'పద్మా నువ్వు శ్రీధర్‌గారిని పెళ్లి చేసుకున్నావుట, రిజిష్టర్డు మారేజి, ఎప్పుడు? నాతో చెప్పలేదే!' అన్నది. 'పెళ్లి అనేదే యిద్దరిమధ్య రహస్యం. దాన్ని బహిరంగం చెయ్యటమెందుకు? షా అన్నట్లు అది Ghastly public confession కాదా?' అన్నాను. 'నీ చమత్కారం సరేగాని ఆయనకు భార్యా పిల్ల లున్నారట, వాళ్ల సంగతేమిటే?' అన్నది. 'ఉన్నారని తెలుసు కాని యింతవరకూ ఆ సంగతి నే నడగలేదు, ఆయన చెప్పలేదు. నువ్వు నమ్మినా నమ్మక పోయినా యిదే నిజం' అన్నాను. 'ఆమె కోర్టులో వ్యాజ్యం వెయ్యదా?' అన్నది. 'ఏం, నువ్వు వెళ్లి చెబుతావా వెయ్యమని?' అన్నాను. 'వేస్తే అప్పుడు నీ పెళ్లి చెల్లదు కదా? అలా చట్టం వచ్చిందే' అన్నది. 'ఏమో నా కివన్నీ తెలీవు. వెళ్లి ఆయనతో నువ్వు చెప్పమన్నట్లు చెబుతాను' అన్నాను. 'మధ్య నా పేరెందుకూ? నీ యిష్టం. నువ్వేం చేసుకుంటావో! చెప్పటం తప్పొచ్చిందే!' అంటూ కోపగించింది పిచ్చి రమ......"

శ్రీధర్ ఏమీ మాట్లాడ లేదు. మౌనంగా ఆమె వైపు చూస్తూ వుండి పోయాడు.

"ఏమండీ, మీరేం మాట్లాడరేం? నేను వట్టి మొద్దును. త్యాగం అని పుస్తకాల్లో చదవటమేగాని త్యాగం చెయ్యటం నాకు తెలీదు. చెప్పండి, మీరుచేసేరా ఈ త్యాగం, మీా అవిడ చేసేరా? ఈ పాపిష్ఠిదానికోసం ఎవరు చేశారు, ఎందుకు చేశారు? అందుకే భగవంతుడు నా కీ శిక్ష వేశాడు....మాయను నానుంచి తీసుకుపోయి త్యాగం ఏమిటో నేర్చుకోమంటు......న్నా......డు" ఆమె కంఠం రుద్ధమై పోయింది. కళ్లల్లో నీళ్లు నిండాయి. శ్రీధర్ ఆమెను చేతుల్లోకి తీసుకున్నాడు.

"పద్మా! నువ్వీ యింట్లో వుంటే లాభం లేదు, నువ్వు మాయను మరచిపోలేవు. నువ్వు నా యింటికి వచ్చెయ్.....సత్యం కావాలిస్తే యిక్కడుంటాడు. అతనికి ఇక్కడ చదువుకోటానికి వీలుగా వుంటుంది......" అన్నాడు శ్రీధర్. ప్రస్తుతం సత్యం శ్రీధర్ యింట్లో రాత్రిళ్లు పడుకుని చదువుకుంటున్నాడు.

పద్మ అంగీకరించలేదు.

ఒకరోజు ఆమె అన్నది: "మీరింత నిర్వ్యాపారంగావుంటున్నా రేమిటి? పూర్వంలా నాటకాలూ, ఆ ఉత్సాహం మీలో కనిపించటం లేదు......మీ కాలాన్ని వృధా చెయ్యకండి......మీా వాళ్లని రమ్మని వ్రాయండి. పిల్లల్ని చూడకుండా ఎలా వుండగల్గుతున్నారు మీరు ఇన్నాళ్లు?"

శ్రీధర్ యిటువంటి ప్రసక్తి వచ్చినప్పుడు ఏమీ మాట్లాడడు.

కాని ఈ పర్యాయం పద్మమణి వూరుకోలేదు. "మీరు ఉత్తరం వ్రాయండి వాళ్లని రమ్మని......మీ జీవితం ఇలా

శిక్షింప జేసుకుంటారా?.....మీరు వ్రాయలేదనే వాళ్లు రాలేదు. మీ రామెను ఏమన్నారో ఏమో ఆమె యిన్నాళ్లుగా పుట్టింటో, ఎందుకు వున్నట్లు?......వ్రాయండి యివ్వాళ తప్పకుండా"

శ్రీధర్ వ్రాయలేదు.

రెండు రోజుల తర్వాత ఆమె మళ్లీ అడిగింది. బలవంతాన అతనిచేత ఉత్తరం వ్రాయించింది. శ్రీధర్ ముక్తసరిగా రెండే మాటలు వ్రాశాడు: "పిల్లల్నిచూచి ఎన్నాళ్లో అయింది. పిల్లలూ, నువ్వూ బయల్దేరి రావలసింది" పద్మమణి ఆ ఉత్తరం తీసుకుని చూచి అన్నది : "ఇదేం ఉత్తరం? ఇలానేనా వ్రాయటం? వేరే వ్రాయండి." "నువ్వా ఉత్తరం చింపేస్తే నేను మళ్లీ వ్రాయను. నేను వ్రాసేది అంతే" అన్నాడు.

పద్మమణి అతని కళ్లల్లోకి దీనంగా, విషాదంగా, ప్రాధేయ పూర్వకంగా చూచింది. అతని కళ్లల్లో అది తిరుగు లేని నిశ్చయం అని గ్రహించింది......"మీ యిష్టం" అని ఉత్తరం అతని చేతికిచ్చివేసి అటువైపు తిరిగి కళ్లు తుడుచుకుంది.

శ్రీధర్ ఆవేశంతో ఆమె భుజాలుపట్టి తనవైపు తిప్పుకున్నాడు......."ఏమిటీ అర్థంలేని కన్నీళ్లు?......పూర్వం ఎంత నవ్వేదానివో. యిప్పుడంత ఏడుస్తున్నావు!........నీ ఎదురుగా నే నుండటమే నీకు కష్టం కలిగిస్తోందా?.....నన్ను వెళ్లమంటే వెళ్లిపోతాను." అన్నాడు.

"కాదు......కాదు......ఇవి మీ ప్రేమను, త్యాగాన్ని మోయలేని కన్నీళ్లు.....ఎందుకు నన్నింత గొప్ప చేస్తారు?...... నాలో ఏముందనీ......వద్దు శ్రీధర్......మీ జీవితం వైశాల్యాన్ని కోరాలి, దాన్ని ఈ చీకటింట్లో, యీ యిరుకులో వాడిపోనివ్వకండి......వెళ్లండి" అతని చెంపల మీద రాస్తూ, గడ్డం పట్టుకుని బతిమాలుతోందా అశ్రు పూరిత నేత్రాలతో. శ్రీధర్ ఆమెను నిండుగా ముద్దు పెట్టుకున్నాడు.

శ్రీధర్ వ్రాసిన ఉత్తరానికి సమాధానం వెంకయ్యగారి నుంచీ వచ్చింది: "వీలు చూచుకుని నువ్వు సెలవుపెట్టి రావల్సింది. పిల్లలు తారా క్షేమం." శ్రీధర్ ఉత్తరం లాగే సమాధానమూ చాలా క్లుప్తంగా వుంది.

పద్మమణి శ్రీధర్‌ను వెళ్లిరమ్మన్నది.

శ్రీధర్ సెలవుపెట్టి బందరు వెళ్లాడు.

వెంకయ్యగారు జరిగిన విషయాలేవీ త్రవ్వి దోషారోపణ చేయలేదు—"ఓబయ్యను గూర్చి సమర్థుడనీ, మా అమ్మాయికీ, నీకూ పెద్ద దిక్కనీ ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. కాని లాభం లేక పోయింది. నీ పొలాన్ని చేసుకుంటూ ఎన్నేళ్లయినా నీకేమీ దక్కనివ్వక పోవటం నాకు బాధగా వుంది. ఉద్యోగం చేస్తూ సొంత వ్యవసాయం కష్టమే. ఒక్క జీతం మీదే ఆధారపడి మీరు కష్టపడుతూ వుండటం నే నెంతకాలం చూస్తూ వూరుకునేది? పెద్దవాణ్ణి యీ విషయంలో నా సలహా ప్రకారం చేస్తే బాగుంటుంది. అక్కడి పొలం అమ్మివేసి, ఉద్యోగానికి రాజీనామా యిచ్చి యిక్కడికి వచ్చేస్తే యిక్కడ మనవాళ్ల కంపెనీలో పెట్టుబడి పెట్టుకోవచ్చు. హైస్కూల్లో ఉద్యోగమూ లభిస్తుంది. సాలీనా మీకు తిండిగింజలు వచ్చేంత మేర పొలం కూడా నేను రాసిస్తాను. ఆలోచించు" అన్నాడు.

"నాకు మా వూరు విడిచిపెట్టటం యిష్టం లేదు" అన్నాడు శ్రీధర్.

"ఊరు తిండి పెడుతుందా? నువ్వు చదువుకున్నావు; లోకానుభవం చాలినంత వుంది.....ఇంగ్లీషువాళ్లు వాళ్లదేశం విడిచి ఇన్ని వేల మైళ్లు ఎందుకు వచ్చారు! తమిళులూ, మళయాళీలూ హిమాలయాలదాకా ఎందుకు వెడుతున్నారు! ఉన్న చోటు వదలటంతో దారిద్ర్యం వదలటమే కాదు, ఎంతో అనుభవమూ, ఎన్నో అవకాశాలూ.....జీవితమూ మారుతుంది...."

"మార్పు మానసికమైంది. ఎక్కడ వుంటేనేం, మనస్సులో మార్పూ పెరుగుదలా లేనిది సంస్కారం అబ్బదు...."

"అవన్నీ సరేనయ్యా! మనస్సు మారటానికైనా చుట్టుపట్లు మారటంలోవుండే సులువు, ముక్కుపట్టుకొని ముక్కటంలో లేదు కదా! నీ సంగతి నువ్వు చూచుకుంటున్నావు గాని నీ పెళ్లాం పిల్లల సంగతి ఆలోచించావా? వాళ్ల అగచాట్లు వాళ్లు పడుతూ వుండవలసిందేనా ? ఇంతమాత్రం గ్రహింపు లేని నీ సంస్కారం ఏం సంస్కారం?"

శ్రీధర్ ఏమీ సమాధానం చెప్పలేదు. వెంకయ్య అతను మెత్తబడటం గ్రహించి, "నీ సెలవు పూర్తయ్యే లోపల యివన్నీ ఆలోచించు. నేనూ వస్తాను, అక్కడి వ్యవహారాలు పూర్తి చేసుకుని రావచ్చు" అన్నాడు.

శ్రీధర్ పార్కులో కూర్చున్నాడు. అతనికి గాంధీ మరణించిన సాయంత్రం తను అక్కడ వుండటం జ్ఞాపకం వచ్చింది : 'ఏమండీ, గాంధీగారు పోతే స్వరాజ్యం పోదా?'—పోదు! పోలేదు!! ఆరాత్రే తనకు 'స్వరాజ్యం' జన్మించింది. ఆ పిల్లమీద తనకు మమకారం, పుట్టిన రోజునుంచీ కూడా! ఆ పిల్ల తర్వాత ధనలక్ష్మి—అదీ కూతురే అయినా దాని మీద అంత మమకారమూలేదు. ఈయిద్దరిమధ్యా తార; తార మూలాన్నే తన పిల్లల అభివృద్ధికీ, తన పిల్లలతోటి సహజ సంబంధానికీ తను దూరంగా వుండిపోయాడు. తార వివాహ వ్యవస్థ; ఈ వ్యవస్థ వ్యక్తిగా తనకు దగ్గరగా రాలేక పోయింది యింతదాకా....

కారణం తారలోనూ వుంది, తార కన్నవారిలోనూ వుంది...... అంతకంటె తనలోనూ ఉంది!......పద్మమణి తన జీవితానికి అర్థం, వ్యాఖ్యానం; ఆ ఆదర్శాన్నీ, వ్యాఖ్యానాన్నీ తార గుర్తించదు. లోకం గుర్తించదు! కాని పద్మమణే తనని తార కోసం పంపింది! ఆ సంగతి తార నమ్ముతుందా? తార తండ్రి తనతో ఏమంటున్నాడు?—పద్మమణిని వదలి వచ్చెయ్యమంటున్నాడు! ''నీ సంగతి నువ్వు చూసుకుంటున్నావు గాని నీ పెళ్లాం పిల్లల సంగతి ఆలోచించావా? ఆ గ్రహింపులేని నీ సంస్కారం ఏం సంస్కారం?'' అని విమర్శిస్తున్నాడు.

'త్యాగం' అంటుంది పద్మమణి.

పద్మ ముసుపటిలా నవ్వదు. కన్నీళ్లు పెట్టుకుంటుంది. పద్మ మారిపోయింది. పద్మలో జీవితంపట్ల విరక్తి కనిపిస్తోంది. అందుకే పద్మ తనని తారకి అప్పగింత పెట్టటానికీ, త్యాగం చెయ్యటానికీ నిర్ణయించుకున్నది. తను పద్మ నిర్ణయానికి బద్ధుడు కావాలా?.....

తను పద్మకు వ్యక్తిగా బద్ధుడు గాని ఆమె నిస్పృహలో తనని గూర్చి చేసే నిర్ణయాలకి కాదు! ఈ విషయంలో స్వయం నిర్ణయాధికారాన్ని తను వదులుకోడు!

పోతే పెళ్లాం పిల్లల బాధ్యతా, దాన్ని గుర్తించే సంస్కారమూ, వివాహ వ్యవస్థకూ సంఘంలోని సంప్రదాయానికి సంబంధించినవి. వ్యవస్థ తరపుననే వెంకయ్యగారు మాట్లాడుతున్నారు. వ్యవస్థ వ్యక్తి కంటె లొచ్చు, హెచ్చు కాదు! తార తనతో వస్తే అంగీకరిస్తాడు. లేకపోతే అంగీకరించడు. తనెందుకు అంగీకరించాలి? అంగీకరించడు......అయితే తను యిక్కడికెందుకు వచ్చినట్లు? పద్మమణి నిర్ణయం ప్రకారం! ఆమె నిర్ణయాన్నీ, తన వ్యక్తిత్వానికీ, వ్యక్తి ధర్మానికీ భంగం కలిగే పరిస్థితిలో తను పాటించ నక్కరలేదు.

వ్యక్తిగా స్వయం నిర్ణయాధికారం నిలుపుకోవడమంటే ఎంత అసిధారావ్రతం!

శ్రీధర్ మరుసటి రోజు మదనపల్లి బయలుదేరాడు. ''తారనూ, పిల్లల్నీ నాతో పంపండి......నా బాగోగులు నాకు తెలుసు'' అన్నాడు ముక్తసరిగా. వెంకయ్యగారికీ ఆశ్చర్యమూ, ఆగ్రహమూ ముంచుకొచ్చాయి. శ్రీధర్‌ని దూషించాడు. అప్రయోజకుడు, వ్యభిచారి, మూర్ఖుడు అన్నాడు......'ఎరక్కనీ చదువు చూచి పని కొస్తావని దాని గొంతుక్కోశాను. ఏ ఉద్దేశంతో దాన్ని తీసుకు వెళ్దామని వచ్చావు? నీ ముండకి నువ్వు చేసేది చాలక దాన్నీ దాసీని చేద్దామనుకున్నావా? ఈ వెంకయ్య బ్రతికుండగా అది నీ గడప తొక్కదు, ఫో! నీ ముఖం నాకు చూప నక్కర లేదు !''

శ్రీధర్ ఒక్కమాట కూడా బదులు చెప్పలేదు.........

పద్మమణితో, ''ఆమె తండ్రి వాళ్లని పంపనన్నాడు..... నేను అప్రయోజకుణ్ణి, వ్యభిచారిని, మూర్ఖుణ్ణిట. ఆయన కూతుర్ని దాసీదాన్ని చేసుకోవాలని నా ఉద్దేశమట......అందువల్ల......''

పద్మమణి చేత్తో అతని నోరు మూసింది. అతణ్ణి గట్టిగా కౌగలించుకుని అన్నది: ''మీరు నా అదృష్టం, నా మణి! నేను 'పద్మ', మీరు 'మణి'.....నేను వదలను, మిమ్మల్ని వదులను!''

## 24

''......ఘోరమైన హత్యాకాండ, రక్తపాతమూ, కాందిశీకుల సమస్యా, దేశాన్ని అనాడు కల్లోల పరచినా, స్వరాజ్యం వచ్చిందన్న ఆత్మ విశ్వాసంతో, ఉత్సాహంతో సమస్యా పరిష్కారానికి పూనుకోవటం జరిగింది. తర్వాత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాము. పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమయ్యాయి. స్వరాజ్యంతోబాటు దేశంలో ఆర్థికాభివృద్ధీ, సాంఘిక సమానత్వమూ సాధించాలని ప్రభుత్వమే కాదు, ప్రతి రాజకీయ పక్షమూ వాళ్ల వాళ్ల కార్యక్రమాన్ని ప్రజలముందు పెట్టుతూ వచ్చింది......కాని ప్రణాళికల ద్వారా పెరుగుతూ వచ్చిన వ్యవస్థా, ప్రభుత్వ విధానమూ స్వరాజ్యం ద్వారా ప్రతి పౌరుడూ ఆశించిన జీవన ప్రమాణాన్నీ వికాసాన్నీ యివ్వకపోగా, వ్యక్తి గతమైన స్వాతంత్ర్యాన్ని ప్రాథమికమైన హక్కుల్నీ క్రమంగా అపహరిస్తున్నాయి......''

''చట్టాలు చెయ్యటం ద్వారా, నిబంధనల్నీ, నిర్బంధాల్నీ యింకా యింకా ఎక్కువ చెయ్యటం ద్వారా మనుష్యుల్లో ఆదర్శాలు పెంపొందవు. నిజాయితీ పెరగదు. దేశం పురోగమించదు. మన ఆశలకీ, ఆదర్శాలకీ, మన నిజాయితీకీ, శక్తి సామర్థ్యాలకూ వాస్తవికమైన ఒక అన్యోన్యతా పొత్తూ వుండాలి......మనకు ఆదర్శం అమెరికా కాదు, రష్యా కాదు, మన ఆదర్శం మనదే! నేటి మన లక్ష్యం ఆర్థిక సంపత్తి పెంచుకోవటమే కాదు, దాన్ని సమంగా పంచుకోవటమే కాదు, భారతీయుడైన ప్రతి వ్యక్తిలోను స్వేచ్ఛాభావమూ, బాధ్యతా, స్వయం నిర్ణయశక్తీ, నిర్భయత్వమూ వికసించాలి. అప్పుడే పటిష్ఠమైన స్వతంత్రమైన జాతిగా ఉజ్జ్వలమైన ప్రాచీన సంస్కృతికి వారసులుగా మనం ప్రపంచంలో తలెత్తుకో గలుగుతాము......అందుకు మార్గం విద్యాభివృద్ధీ, విజ్ఞానాభివృద్ధీ—కేవలం డబ్బు ఖర్చు పెట్టటం కాదు. వ్యక్తికి స్వాతంత్ర్యమూ, బాధ్యతా యిచ్చి అతనిలోని సృజనాత్మక శక్తుల్ని పురికొల్పాలి. ప్రస్తుతం ఇందుకు వ్యతిరేకంగా జరుగుతోంది. అప్రయోజకులూ, లంచగొండులూ, తాగుబోతులూ, దొంగ వ్యాపారులూ సంఘంలో యీ విశాల

మైన దేశంలో వుండకపోరు. ఎప్పటికీ వుంటారు. వారిని ఒక కంట కనిపెట్టి వుండటం ప్రభుత్వ ధర్మం. కాని వ్యవస్థ వారి కోసమే అయినట్లు తక్కినవారి సృజనాత్మక శక్తికీ, వైయక్తికమైన అన్వేషణకూ, మార్గానికీ ప్రతిబంధకంగా చట్టాలూ నిబంధనలూ రూపొంద కూడదు. ఇలా రూపొందుతూ రావటం పార్టీ నియంతృత్వానికీ, ప్రజల బానిసత్వానికీ దారి తీస్తుంది. ఈ పరిణామాన్ని అరికట్టి నిరోధించే వుద్యమం ఇవాళ ఎంతైనా అవసరం. అలా నిరోధించినప్పుడే మన గాంధీకి నిజమైన వారసులం. రాచకీయ పార్టీలో సభ్యులకు దాని ఆదేశాలు ఎలా వుండాలీ అంటే—కట్టుకునే గుడ్డనుంచీ, తినే తిండి, మాట్లాడే మాటదాకా ప్రతి విషయంలోనూ పార్టీ ఆదేశాలంటూ సభ్యుల వ్యక్తి స్వాతంత్ర్యాన్ని హరించేవిగా వుండ కూడదు. రాచకీయాల్లో ముఖ్యమైన విషయాల మీదే పార్టీ విధానం అనేదీ, సభ్యులు పాటించవలసిన ఆదేశం అనేదీ వుండాలి. తలిమ్మా విషయాల్లో వ్యక్తులు వాళ్ల యిష్టా నిష్టాలని నిర్ణయించుకోవటానికీ నిర్భయంగా వెలిబుచ్చటానికీ అవకాశం వుండాలి.

"నేటి పరిస్థితుల్లో ముఖ్యమైన సంగతి ఒక్క ముక్కలో చెప్పాలంటే సామాన్యుడైన భారతీయుణ్ణి వ్యక్తిగా మనం విశ్వసించాలి; గౌరవించాలి. అదే చెయ్యటం లేదు. ప్లానింగ్ లెక్కల్లో, పార్టీ మెజారిటీలలో, రేషనింగు చిట్టాలలో ఒక నంబరుగా మెంబరుగా భారతీయుణ్ణి చూస్తున్నాము. ఇది అవసరమే కావచ్చు కొంతవరకు. కాని క్రమంగా యీ దృక్పథం ద్వారా అతని వ్యక్తిత్వాన్నే విస్మరించి, అతని ప్రత్యేకతని నాశనం చేసే విధానాలు రూపొందుతున్నాయి. ఈ సంగతి గ్రహించే ఓపికా, దీన్ని ఎదుర్కొనే సాహసమూ రాను రాను ప్రజల్లో లోపిస్తోంది......దీన్ని గూర్చి విద్యాధికులు జాగ్రత్తగా ఆలోచించి చర్చించవలసిన అవసరం ఎంతైనా ఉంది."

పార్లమెంటు సభ్యుడు ఎస్. ఎన్. రాజ్ మదనపల్లి కల్చర్ క్లబ్‌లో ఉపన్యసిస్తున్నాడు. శ్రీధర్ హాల్లో ప్రవేశించేప్పటికే ఉపన్యాసం ప్రారంభమైంది. స్ఫురద్రూపి, బట్టతల, కళ్లకు లావుపాటి నల్ల ఫ్రేము అద్దాలు—అతన్నెక్కడో చూచినట్లే వుంది కాని గుర్తుకు రాలేదు శ్రీధర్‌కు. వ్యక్తి ప్రాధాన్యతను గూర్చి నేటి రాచకీయ పరిస్థితులను పర్యాలోకిస్తూ గంటసేపు ఉపన్యసించి అతను విరమించాడు. వందన సమర్పణతో సభ ముగిసింది. సభికుల్లో ముందు వరుసలోనున్న ఆత్మానందస్వామిని కలుసుకోవటానికి శ్రీధర్ జనాన్ని తప్పించుకుని ముందుకు వచ్చేప్పటికి ఆయన వక్త దగ్గరకు వెళ్లాడు. శ్రీధర్ కూడా దగ్గరకువెళ్లి స్వామిజీకి నమస్కారం చేశాడు. స్వామిజీ చేత్తో ఆశీర్వాద పూర్వకంగా సౌజ్ఞచేసి చిరునవ్వు నవ్వి వక్తతో మాట్లాడుతున్నాడు. అతను వింటూ శ్రీధర్ వైపు ఎందుకో తదేకంగా చూస్తున్నాడు. శ్రీధర్ అతణ్ణి నిర్లక్ష్యంగా ఒక్క చూపు చూచి స్వామిజీ వైపు దృష్టి తిప్పుకున్నాడు. స్వామిజీ మాట్లాడటం ముగిశాక ఆ వక్త "అవకాశం వుంటే మనం తీరిగ్గా మాట్లాడుకోవచ్చు.....వీలుంటుందో లేదో" అంటూ శ్రీధర్‌ను చూపించి, "వీరిని తెలుసుకోవచ్చా" అన్నాడు స్వామిజీతో. "నా స్టూడెంట్ యిరవై ఏళ్ల క్రితం.....ఇప్పుడు హైస్కూల్లో టీచర్... ...మిస్టర్ శ్రీధర్" వక్త శ్రీధర్‌వైపు చేయి సాచి కరచాలనం చేసి, చేయి వదలకుండానే "శ్రీధర్!లయొలా కాలేజ్, బి. యస్. సి.' అంటూ శ్రీధర్ కళ్లల్లోకి చూచి నవ్వాడు. శ్రీధర్‌కు గుర్తు వచ్చేసింది. "నాగరాజు కదూ.....చాల మార్పు... గుర్తుపట్టలేక పోయాను. ఆ జుట్టు యిప్పుడు లేదు....అద్దాలు కొత్తగా వచ్చాయి' అన్నాడు.

"మారటం జీవిత లక్షణం....ఏం, నువ్వు మారలేదూ?... అవును, మారలేదు!.....అదే అమాయకత్వం నీ ముఖంలో...... అందుకే నేను సులువుగా గుర్తుపట్టాను" అంటూ నవ్వాడు. నాగరాజుతో ప్రక్కన వున్న పెద్దమనిషి "మీకు టైము అవుతుందేమో!" అన్నాడు.

"అవును......శ్రీధర్! నాతో కూడా రా......నా కింకో ఎంగేజుమెంట్ ఉంది...తర్వాత కాస్త తీరిగ్గా మాట్లాడుకుందాం" అన్నాడు. ఆత్మానందస్వామి వైపు చూచి చేతులు జోడించి సెలవు తీసుకుని క్లబ్బు సెక్రటరీ ప్రెసిడెంట్లతో కలిసి బయటికి నడిచాడు నాగరాజు.

శ్రీధర్ వెంటనే వున్నాడు. నాగరాజు అతణ్ణి కారులో తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. "శ్రీధర్! కబుర్లు చెప్పవేం? అయితే మద్రాసు వదలిన తర్వాత యిక్కడే టీచర్‌గా స్థిరపడ్డావన్న మాట!......నే నెప్పుడూ యీ ప్రాంతానికి రావటం పడలేదు. ఒకసారి బెంగుళూరునుంచీ యిటు రావాలనుకున్నాను గాని పడలేదు........."

శ్రీధర్ అతని చెయ్యి పట్టుకుని నొక్కుతూ ఏమీ మాట్లాడలేకపోయాడు.

నాగరాజుకి ఎంగేజ్‌మెంట్స్ పూర్తి అయ్యాకగాని శ్రీధర్‌తో మాట్లాడటానికి వీలు చిక్కలేదు. ఏకాంతం లభించగానే నాగరాజు అన్నాడు. "ఏం, ఇప్పటికైనా పోయిందా లేదా ఆనాటి కోపం? నీ ధోరణి చూస్తే ఇంకా పోలేదట్లే వుంది.!" అన్నాడు నవ్వుతూ. "నీమీద కాదు ఆ కోపం! నామీద నాకే! తర్వాత దాని ఫలితం అనుభవించిందీ నేనే!" అన్నాడు శ్రీధర్. "ఏమిటి ఫలితం? నాకు వినాలని ఉంది......డిన్నరుకి యింకా చాలా వ్యవధి వుంది. ఎక్కడ మీ యిల్లు? వెళ్దాం పద" అన్నాడు.

"నాకు యిల్లులేదు."

"అదేమిటి? అయితే ఎక్కడుంటున్నావ్?"

"ఒక మేడమీద పోర్షనులో...నా భార్యా పిల్లలు—అయిదేళ్ళయింది—బందురు వెళ్ళిపోయారు......నా జీవితాన్ని పంచుకున్న వ్యక్తి గతించి ఏడాది అవుతోంది.....క్షయతో......ఇప్పుడు నువ్వు చూడవలసింది నా తాలూకు ఏమీ లేదు నేను తప్ప" అన్నాడు శ్రీధర్ విషాదంగా నవ్వి.

"ఓ, అయాం సారీ!" అని నాగరాజు అతనివైపు అలానే చూస్తూ వుండిపోయాడు.

"నీ సంగతేమిటి?" అని ప్రశ్నించాడు శ్రీధర్.

"ఇదుగో చూస్తున్నావుగా......రాజకీయాలు, పార్లమెంటు.....ఇప్పుడు క్రొత్త పార్టీ.....వచ్చే ఏడాది మళ్ళీ ఎలక్షన్లు......నా నియోజకవర్గంలో నాకేం భయం లేదు......'

"అవన్నీ కాదు......నువ్వు పెళ్ళి చేసుకున్నావా?"

"ఓ దానికేం? నా భార్య డాక్టరు....నా కొడుక్కి ఎనిమిదేళ్లు" అని నవ్వాడు నాగరాజు.

"ఆ రోజుల్లో పెళ్లి చేసుకోను అనేవాడివి"

నాగరాజు పెద్దగా నవ్వుతూ, "పంద్రెండు పదమూడేళ్లతర్వాత కూడా ఆ అభిప్రాయంలోనే వుండమంటావా? జీవితం ఎంత మారిపోలేదు!"

"జీవితాన్ని గూర్చిన అప్పటి సిద్ధాంతం కూడా మారిందా?"

"లేదు.....ఎంతో అనుభవం సంపాయించాను......కాని అప్పటికీ యిప్పటికీ మూలసిద్ధాంతంలో భేదంలేదు అనే చెప్పాలి. ఎందుకోగాని మొన్ననే ఒకసారి పరామర్శించి చూసుకున్నాను, విద్యార్థిగావున్న రోజుల్నుంచీ గడిచిన నా జీవితాన్ని.....మారుతున్న జీవితంతో మారుతూనే వున్నాను; నా కెక్కడా నేను వేరు, జీవితం వేరు అనే భేదభావం రాలేదు. ఎక్కడా పెద్ద సంఘర్షణలూ, నిరాశలూ కలగలేదు.......జీవితానుభవం యిచ్చగలిగిన హుషారూ, ఆనందం పొందుతూనే వున్నాను. ఏవైనా చిక్కులూ సమస్యలూ వచ్చినా వాటిని పరిష్కరించుకోవటమే ఒక సరదా.."

"జీవితంలో మారుతూ ఉండటం, అభిప్రాయాలూ నిర్ణయాలు మార్చుకుంటూ ఉండటం అంటే వ్యక్తిత్వమూ, స్వయం నిర్ణయాధికారమూ లేకుండా యాంత్రికంగా సుఖాన్నీ, డబ్బునీ, పలుకుబడినీ అన్వేషించటం కాదా?"

"ఉండు ఉండు......డబ్బూ, పలుకుబడీ, సుఖమూ మూడూ ఒక కోవలోనికి రావు. మొదటి రెండూ నేను కోరే సుఖాన్నివ్వలేవు. అవి యిచ్చే సుఖం, నిజమే, యాంత్రికమైనదే; కాని నేను అన్వేషించే సుఖం—అది సుఖం కాదు ఆనందం; అది జీవితంతో జీవిత గమనంతో సంపూర్ణమైన సామరస్యాన్ని తాదాత్మ్యాన్నీ సాధించటం ద్వారానే కలుగుతుంది. పోతే, నా వ్యక్తిత్వాన్నీ, నా జీవితాన్నీ వేర్వేరుగా నేను చూడలేను. నా జీవితమే నేను, నేనే నా జీవితం.....జీవితం పరమోత్కృష్టమైన విలువ—అప్పటికీ, యిప్పటికీ నాది ఆ సిద్ధాంతమే! మళ్ళీ 'జీవితం అంటే ఏమిటీ అని పరిశీలించి చూస్తే, నా జీవితమూ, సమాజంలో యితర మనుష్యుల జీవితమూ అంటే సమాజంయొక్క చరిత్రా పెనవేసుకునే వున్నాయి. సమాజంయొక్క గమనంతో అడుగువేస్తూ, దానికి ముందుండి దారి చూపించే ప్రయత్నమే నేను చేస్తున్నది. ఇవ్వాళ వ్యక్తికి వుండవలసిన ప్రాధాన్యతను గూర్చి నేను మాట్లాడింది విన్నావు. ఈ ప్రాతిపదిక మీద ఒక క్రొత్త పార్టీని నిర్మించటమే నేనూ, నాకంటే పెద్దలైనవారు కొంతమందీ చేస్తున్నదీ. మేమిప్పుడు మైనారిటీనే కావచ్చు, మమ్మల్ని గురించి అపోహలూ కలుగవచ్చు; కాని మేం వేస్తున్న ముందడుగు జీవితాన్నీ, దేశంయొక్క గమనాన్నీ చక్కగా పరిశీలించి దానితో లయ కలపడానికి వేస్తున్నదే!......"

"నువ్వు మరో ఉపన్యాసం దంచితే నాకు ప్రయోజనం లేదు. క్రమంగా నా సందేహాలకి సమాధానం చెప్పాలి. నీకు యీ దేశంలో సామాన్య వ్యక్తిమీద నమ్మకముందంటున్నావు. ఆ వ్యక్తి ఎంత భీరువు, బాధ్యతను వహించలేని, బాధ్యతను నిరాకరించే యాంత్రిక మానవుడు అనే సంగతి అర్థం కాలేదనుకుంటున్నాను. అందరికీ నీ చొరవా, నీ చిత్తశుద్ధీ, నీ నేర్పూ వున్నాయా? నీ కొత్త పార్టీకి భవిష్యత్తు లేదనిపిస్తోంది....."

"భీరుత్వం, బాధ్యతను వదిలించుకోజూచే మనస్తత్వం నిజమే; అవి నేను గమనించక పోలేదు. కాని అలాంటి మానవులకు ఏమిటి విముక్తి? వాళ్ల భీరుత్వాన్నీ, చాంచల్యాన్నీ వాళ్ళు ఎదుర్కొనే అవకాశం కల్పించటమే! ఆ అవకాశం చరిత్రలో యిదివరకెప్పుడూ రాలేదేమో; ఈ ప్రజాస్వామ్యయుగం పురోగతి ఆ అవకాశం కల్పించటంలోనే వుంది! గాంధీగారి ఉద్యమంలో సాముదాయికంగా, మూక ఉమ్మడిగా వీళ్ళు చూపిన ధైర్య స్థైర్యాలు—అవి నీ వన్నట్లు సామూహికమైనవీ, యాంత్రికమైనవీ. ఆ యంత్రాన్ని నడిపిన ఒక్క వ్యక్తి, మహాత్ముడు గాంధీ. నిజమైన ప్రజాస్వామ్యానికి ఆ పద్ధతి వ్యతిరేకం. వీళ్లందరూ కలిసి యంత్రంగా వుండటం కాదు, వీళ్లందరూ ఒక్కొక్కరూ స్వయం నిర్ణయాధికారం కలిగిన వ్యక్తులుగా తయారు కావాలి. అలా జరగాలంటే వాళ్లకి క్రమంగా ఆ అధికారం యిస్తే తప్ప వీలుకాదు. పంచాయతీ రాజ్యం అన్నారు. బాగానే వుంది. కాని అంతకంటె ముందు విద్య, విజ్ఞానం

ప్రధానం......సరే, మళ్లీ రాచకీయాల్లో పడిపోతున్నాను..... నువ్వు చెప్పు......."

"ఒక్కొక్క వ్యక్తీ ఒక్కొక్క తరహాగా తయారైతే సంఘం అల్లకల్లోలమైపోదా? సంఘానికి వ్యవస్థా, సాము దాయికమైన విలువలూ ఉండాలికదా? ఆ విలువలు వ్యక్తిత్వాన్ని కూడా కాపాడేవిగా వుండాలి అంటే తప్పకుండా ఆధ్యాత్మిక మైనవిగానే వుండాలి......అంటే మన వేదాంతం మత సంప్రదాయం ప్రసక్తి కూడా రావాలి కదా."

"అల్లకల్లోలమేమీ సంభవించదు. సైన్సు, టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థ యివి నిర్మించిన నిర్మిస్తున్న వ్యూహాన్ని యిప్పుడెవ్వరూ ఛేదించలేరు. ఎటొచ్చీ యీ వ్యూహంలో వుంటూనే అందులో నలిగి పోకుండా వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని కాపాడుకొని, జీవితంలో ఆనందాన్నీ, తృప్తినీ సాధించాలి. సాంప్రదాయిక మైన ఆధ్యాత్మిక మార్గం ఈ లక్ష్యానికి పనికి వస్తుందని తోచదు! సైన్సు, టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థ నిర్మించిన ఈ వ్యూహంలో ఉత్పన్నమయ్యే ఎన్నో వ్యక్తిగత సమస్యలకు, సంప్రదాయం పరారీ తత్వాన్ని తప్ప మరేమీ బోధించటంలేదని పిస్తోంది నాకు......"

"నువ్వు ఈ విషయం ఆత్మానందస్వామితో చర్చిస్తే వినాలని వుంది నాకు. అదలా వుంచు. నా సంగతేమిటంటావు? నేనూ నాలోని భీరుత్వాన్నీ, చాంచల్యాన్నీ ఎదుర్కొన్నాను; వ్యక్తిగా జీవించే ప్రయత్నంలో సంఘంలో సంప్రదాయంతో ఘర్షణపడి వ్యవస్థకు ఎదురు తిరిగాను. వ్యక్తిగా నా అస్తిత్వానికి దోహదమైన అనుభూతిని, ఆనందాన్ని నిండు మనస్సుతో నా సర్వస్వంతో అన్వేషించాను. ఆ అనుభూతి పద్మమణితోడి అనుబంధంలో కలిగింది. ఆమె నేను చూస్తుండగానే క్షయతో బాధపడి చివరకు నా చేతుల్లో మరణించింది. అదృశ్యమై పోయింది. మొగ్గ పుష్పమై నలిగి వాడి పోయింది.....నువ్వన్నట్లు మార్పు సహజమే......కాని ఆ మార్పుకి అతీతమైన ఆ పూవు జీవితాన్ని సురభిళం చేసిన, దాని తాలూకు సౌరభం నా ఆత్మలో అంకితమైంది. మంచీ చెడూ, నీతీ అవినీతీ, త్యాగం స్వార్థం అన్న ద్వంద్వాల మధ్య వూగులాడినా, వాటిని అధిగమించిన జీవిత పరమార్థంయొక్క దర్శనం నాకు లభించింది......కాని కాని ఏమిటి లాభం? ఏమిటి ప్రయోజనం? చివరి పర్యాయం వీడ్కోలుగా ఆమె కళ్లు నావైపు చూచినప్పుడు, ఆ వీడ్కోలు—నదిని దాటుతూ పడవలో వెళ్లిపోతూ, సంధ్యా సమయంలో కాలి బూడిదైపోయి ఎడారిగా మారిన గట్టువైపు దుఃఖంగా, అంతలో నిర్లిప్తంగా, ప్రశాంతంగా చూస్తున్నట్లు వుంది. ఆమె అవతలి గట్టు చేరుకున్నది, జీవచ్ఛవమై నేను యివతలి గట్టు మీదే నిలబడి పోయాను! నేను ఎందుకు జీవించాలి? ఆమె స్మృతికోసం జీవించాలా? నేను సాధించిన వ్యక్తిత్వానికి, యాంత్రిక శక్తులనుండి నేను పొందిన విముక్తికి ప్రయోజన మేమిటి? అర్థం ఏమిటి? అందరు వ్యక్తిత్వాన్ని పొందాలని నువ్వు ఉపన్యసిస్తున్నావు, రాచకీయంగా ప్రయత్నిస్తున్నావు, యిలా వ్యక్తిత్వాన్ని పొందక పోతేనేం? నీ సైన్సూ, టెక్నాలజీ చనిపోయిన పద్మను బ్రతికించలేవు కదా? ఎందుకీ వ్యర్థ ప్రయత్నాలు? మనుష్యులు యాంత్రికంగా బ్రతికితే నేం? ఎలా వుంటే నేం? నీ కెందు కీ వ్యర్థ తాపత్రయం? అంటాను నేను......"

నాగరాజు దీర్ఘ నిశ్వాసంతో లేచి నిల్చున్నాడు. సమాధానం కోసం ఎదురు చూస్తున్న శ్రీధర్ భుజం మీద చేయి వేస్తూ, "లే డిన్నర్ టైమ్ కావస్తోంది, వెళ్దాం......నీ ప్రశ్నకు సమాధానం తర్వాత......" శ్రీధర్ లేచాడు. బాత్‌రూమ్‌లోకి వెళ్లి వస్తూ, "మళ్లీ మనం లయోలా కాలేజిలో మాట్లాడుకుంటూ ఉన్నట్లే ఉంది నాకు! మన కిద్దరికీ వ్యక్తిత్వాల్లో వున్న మౌలికమైన భేదం ఏమిటో చెప్పనా? నీకు జీవితంలో నవ్వటం చేత కాదు, నాకు ఏడవటం చేత కాదు. అంతే. రా, పోదాం."

## 25

మరునాటి రోజు నాగరాజు శ్రీధర్‌తో అస్తిత్వ వాదాన్ని గూర్చి ముచ్చటించాడు. "శ్రీధర్! మనుష్యులలో వైవిధ్యం ఎంతో వుంటుంది. వ్యక్తిత్వాన్ని అన్వేషించే వారందరికీ సత్యం ఒక రీతిగా దర్శనం కాదు. అస్తిత్వవాదుల్లో కర్క్‌గార్డ్ ఆస్తికుడూ, సార్త్రే నాస్తికుడూ. నేను నిన్న చెప్పినట్లు కొందరికి నవ్వటమే, హాస్య రసానుభూతే సాధ్యం. మరికొందరు ఎంతో లోతుగా తీవ్రంగా అనుభవిస్తారు. రెండో రకం వారికి సత్యం అనంతమైన నిస్పృహగా అనుభూత మౌతుంది. సార్త్రేవంటి తీవ్రవాదులకు నీలాగే జీవితం—అర్థ శూన్యం; ఆత్మదర్శనం అవధులు లేని నిస్పృహ. నావంటివారు జీవితాని కొక నిశ్చితమైన సంపూర్ణమైన తార్కిక వ్యాఖ్యానం లేదు; అందుకు అర్థశూన్యం అంటూ ఎప్పటి కప్పుడు నవ్వేస్తాము. నాకు ఆత్మదర్శనం ఆనందం. ఇది మన అస్తిత్వాల్లో వుండే భేదం. నీ అనుభూతిని గూర్చి విన్న తర్వాత నాకు తోచిం దేమిటంటే—మనం ఒకళ్లనుంచీ ఒకళ్లు పొందవలసిందీ, నేర్చుకోవలసిందీ కొంత వున్నదీ అని. నీవు పద్మమణి ద్వారా పొందిన అనుభూతి అలౌకికమైన దర్శనానికి, యోగులు అన్వేషించే సమాధ్యవస్థకూ చేరువలో వుంది; ఆ అనుభూతి తర్వాత యీ మామూలు ప్రపంచం నీకు శుష్కంగాకనిపిస్తోంది.కానిఈ నిస్పృహనునీనుంచి

ఎందుకు వేరుచేసి చూస్తున్నావు? పద్మమణి జీవించిన కాలంలో పొందిన ఆనందమే కాదు, యివాళ లోకాన్ని చూచి నువ్వు అనుభవించే వైముఖ్యమూ నీ వ్యక్తిత్వ స్వరూపమే! దీన్ని నువ్వు అంగీకరించాలి.అంగీకరిస్తే తప్ప మార్పుని జీవితాన్ని అంగీకరించినట్లు కాదు. పద్మమణి పోవటంతో ఒక దశ పూర్తి అయింది. ఆమె ద్వారా నువ్వు పొందిన 'వ్యక్తిత్వాన్ని'లోకంలో క్రొత్తగా సంబంధం ఏర్పరచుకోవటానికీ, జీవితాన్ని క్రొత్తగా దర్శించటానికీ వినియోగించాలి. నువ్వు చెప్పిన దానిని బట్టి చూస్తే నీ భార్యతో 'వ్యక్తిగతమైన' బంధాన్ని నిర్మించుకునేందుకు నువ్వు చేసిన ప్రయత్నం ఏమీ కనిపించదు. పద్మమణి పోవటంతో ఆమె జీవితం యిక్కడ పూర్తి అయింది కాని, నీ జీవితం పూర్తి కాలేదే! నువ్వు ఒక గతానుభవాన్ని స్మరిస్తూ యీక్షణం జీవితాన్ని నిర్లక్ష్యం చెయ్యటం, అదీ యాంత్రికమైన అవస్థే; నీ వ్యక్తిత్వానికి బుజువు కాదు! పోతే నువ్వు దర్శించిన అనుభూతి నా కెప్పుడైనా లభిస్తుందో లేదో! నేను నీ కంటె సామాన్యుణ్ణి...." అన్నాడు నాగరాజు.

తర్వాత వాళ్లిద్దరూ కలిసి ఆత్మానందస్వామిని చూడటానికి వెళ్లారు.

"స్వామిజీ, మొదటి దశలో ఆదర్శాలూ, విశ్వాసాలూ ముఖ్యమనీ, అలా ధర్మ సాధన ద్వారా జీవితానుభూతి పొందటం ముఖ్యమనీ, తర్వాతి దశలో 'సర్వ ధర్మాన్ పరిత్యజ్యమామ్ ఏకమ్ శరణమ్ వ్రజ' అని గీతలో చెప్పినట్లు మాయనుంచీ విముక్తి పొంది జ్యోతిర్మయమైన సత్యంలో లీనం కావటం జరుగుతుందనీ చెప్పారు. ఇదుగో ఈస్నేహితుడు వ్యక్తి మనస్సులో త్వర త్వరగా ప్రవేశిస్తోంది—అలా జరుగుతున్నప్పుడు ఆ మార్పును ప్రయత్నపూర్వకంగా గుర్తించి అంగీకరించటం కంటె ఆత్మ సాధన వేరు లేదు! అలా గుర్తించి అంగీకరించటంవల్ల నేడు వ్యక్తికి తన 'వ్యక్తిత్వం' అంటే ఆ యాంత్రిక శక్తుల్ని ఆజమాయిషీ చేసే స్వాధికారం, స్వయం నిర్ణయ శక్తీ,వివేచన ద్వారా అనుభవం ద్వారా లభిస్తుంది. ఈ కదలికనూ, మార్పునూ అంగీకరించటానికి ప్రతిబంధకమైనది నేడు సంప్రదాయమే—విశ్వాసాలను గూర్చి ధర్మాన్ని గూర్చి అవి చలించరాదనే అపోహ; నీతిని గూర్చి భయం; మార్పు అంటే ప్రమాదం, తప్పు అనే భీతి! పూర్వం పరిస్థితులు, సంఘ వ్యవస్థ నిలుకడగా వున్నప్పుడు నీతి నియమాలూ, ధర్మమూ, నిర్దిష్టంగా, నిలుకడగా వుండేవి; వాటిని అంగీకరించటం జీవితానుభూతిని యథాతథంగా పొందటం, జీవితం మీద అధికారం పొందటం అయ్యేది. ఇవ్వాళ ఆత్మవిశ్వాసం లేకుండా ప్రాత ఆదర్శాల్నీ ధర్మాన్నీ అడ్డం పెట్టుకుంటే జీవితానుభూతి చేయిజారి పోతోంది. మనిషి జీవితపు రథ చక్రాల క్రింద నలిగి పోతున్నాడు. మరోవిధంగా చెప్పాలంటే ఆనాటి జీవిత తటాకానికి ఆదర్శాలు చాలు; ఈనాటి జీవిత ఝరికి ఆత్మ ప్రత్యయం కావాలి. అందుకే ఆనాడు జీవితాన్ని 'ధర్మం' ద్వారా అన్వేషిస్తే, యీనాడు జీవితాన్ని 'ఆత్మ ప్రత్యయం' ద్వారా అన్వేషించాలి అంటున్నాను. అలా చెయ్యటంతో యీ జీవితాన్ని వదలి దూరంగా ఎప్పుడో ఎక్కడో యోగ సాధన, ఆత్మ సాక్షాత్కారమూ జరుగుతాయి అనే విభజన కృత్రిమమైన ఏర్పాటూ పోతుంది. వ్యక్తిగా జీవించటమే నేటి యోగ సాధన, ఆత్మ సాక్షాత్కారమూ!"

స్వామిజీ అంతా ప్రశాంతంగా విని, "మీరు ప్రాత క్రొత్తల సమన్వయ దృష్టితో చెప్పేది నేడు ప్రతి వ్యక్తీ కర్మయోగి కావాలని! దానికి అనువైన క్రొత్త పరిస్థితులు సంఘంలో ఏర్పడుతున్నాయనీ! బాగానే వుంది! కాని ఆ స్థితికి మీరు చెప్పిన దృక్పథంతో, అంటే వ్యవస్థాగతమైన ధర్మా ధర్మ విభాగాన్ని కాదని స్వయం నిర్ణయ శక్తితో ఎంతమంది తయారు కాగలరు? అని నా ప్రశ్న. మీరు ఒక విశిష్ట మార్గంలో వెళ్లటం బాగానే వుంది; అది మీకు జన్మతః వచ్చిన సంస్కారం. అది మీ స్వధర్మం. మీలాగ జీవితంలో మార్పును అంగీకరిస్తూ, దుఃఖాన్నీ, జరామరణాల్నీ తేలిగ్గా తీసుకునే వాళ్లెంతమంది ఉంటారు? 'గీత' మీ మార్గాన్ని కాదనదు! మీరు చెప్పేది 'నిర్లిప్తత'కు వ్యాఖ్యానప్రాయంగానే వుంది......నాకు శ్రీధర్ అనుభవం తెలుసు. శ్రీధర్ సాధనా స్వధర్మ నిర్ణయం ద్వారానే జరిగింది. సంఘాన్నెదిరించి పద్మమణిని అంగీకరించటంలో శ్రీధర్ చేసింది స్వధర్మావలంబనమే!నా అభిప్రాయంలో మార్గం ఏదైనా, మీరూ స్వధర్మాన్నే ఎన్నుకున్నారు, శ్రీధర్ అలానే చేశాడు. మీ స్వధర్మాన్ని అందరికీ వర్తింప జెయ్యటం ప్రమాదమేమో! పోతే, మరొక్క విషయం : జీవితాన్నీ; ఆత్మ ప్రత్యయాన్నీ ఒకటిగా 'ఆత్మ' వేరు అన్న విభేదం స్పష్టం. జీవితం మారుతుంది. 'ఆత్మ'కు మార్పులేదు అన్న విభజన నేటి పరిస్థితుల్లో విపరీత వ్యాఖ్యానాలకు లోనవుతూంది. మార్పులేని, హేతువాదానికి అందని యీ 'ఆత్మ' ఏమిటి? అసలు వుందా? యిది మోసమా? అంటారు భౌతికవాదులు. జీవితం 'మాయ' అంటే ఆ భావం యథార్థానుభవంలో ఏ విధంగానూ పనికి రాదు......జీవితంలో లిప్తమై కూడా జీవాత్మ అతీతంగా వుండే అనుభవం వున్నదీ అన్నా దాన్ని బోధపరుచుకోవటం కష్టమే! 'అజ్ఞానే నావృతమ్'. జ్ఞానమ్ ఇందులో జ్ఞానాన్నీ అజ్ఞానాన్నీ విడదియ్యట మెలాగ? గీతాకారుడు 'శ్రేయాన్ స్వధర్మో విగుణః' అని ఒకసారి కాదు, రెండుసార్లు (III లో XVIII లో) చెబుతూ 'స్వభావ నియతమ్ కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్' అన్నాడు. ఏది స్వధర్మమో కాదో, ఏది స్వభావ నియతమో కాదో నిర్ణయించుకోవటం ఎలాగ? ఇన్ని యాంత్రిక శక్తులు మనిషి మీద చోదకత్వం నెరపు

తున్న కాలంలో అదీ అసాధ్యమే! ఇవన్నీ నేడు సంప్రదాయం తెలుసుకునే సామాన్యుణ్ణి ఎదుర్కొనే సమస్యలు. జీవన వేగం ఉద్ధృతం కావటంతో ప్రతి ఆదర్శాన్నీ—స్వధర్మమైనా, స్వభావమైనా—తర్కంతో విశ్లేషించి ఏమిటి? ఎందుకు? అనే విచికిత్సకు లోనవుతూ ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో వున్నాడు సామాన్యుడు. ఈ పరిస్థితిలో ఆదర్శం, స్వధర్మం, నీతి అనే వాటికి నిలుకడ, నిర్దిష్టమైన స్వరూపం ఉండదు. సాంప్రదాయికమైన తత్త్వ జిజ్ఞాస: జీవితం దుఃఖమయము, మనిషికి జరా మృత్యువులు వున్నాయి అనే విషయాన్ని గూర్చి ఆందోళన పడుతూ ప్రారంభమౌతుంది. దీన్ని గూర్చి సిద్ధార్థుడు పడిన ఆందోళన ఎందుకో నా కర్థం కాదు! మార్పువల్ల దుఃఖమే కాదు, సుఖమూ వస్తుంది; జీవితంలో కలిగే మార్పులకీ, మనిషి మనస్సు కూడా మారుతూ సరిపెట్టుకుంటూ వస్తే యిబ్బంది వుండదు కదా! మార్పుని జీవన ధర్మంగా, జరా మృత్యువుల్ని సహజంగా సిద్ధార్థుడు ఎందుకు అంగీకరించ లేదో నాకు అర్థం కాదు! దుఃఖంతోపాటు సుఖాన్నీ నిరాకరించమని ఏమిటో ఆ సలహా! వాంఛ అనేది దుఃఖాన్నీ సుఖాన్నీ రెండింటినీ యిస్తుంది కదా! రెండింటినీ అంగీకరించే ప్రయత్నమే ఎందుకు చెయ్యరాదు? నిర్లిప్తతతో కాదు, ఉద్విగ్న మనస్కతతోనే అంగీకరించాలి అంటాను. అప్పుడు జీవితాన్నీ ఆత్మనూ వేరుగా చూడటం కాదు, రెండింటికీ తాదాత్మ్యం అంగీకరించటం అవుతుంది. జీవితం క్షణ క్షణమూ మార్పు చెందుతుందనీ, దానికి అనుగుణంగా మన మనఃస్థితీ మార్పు చెందాలనీ, అలా చెందటానికి ప్రయత్నం చెయ్యటమే నేటి సాధన అనీ నా అభిప్రాయం! జీవితం అంటే కదలిక; కదలిక అంటే ఒక దాన్ని వదలి మరొక దాన్ని ఆశ్రయించడం. ఒక అనుభూతిని విస్మరించి మరొక అనుభూతిని అంగీకరించటం. ఇటువంటి కదలిక, మార్పు నేడు సామాజికమైన యాంత్రిక శక్తుల ద్వారా వ్యక్తి జీవితంలో ఆదర్శాలూ, విశ్వాసాలూ అర్థ శూన్యమనీ జీవితానుభూతిని యథాతథంగా ఆనందమయంగా పొందాలనీ అంటాడు. మీరిద్దరూ చర్చిస్తే వినాలని ఉంది'' అని శ్రీధర్ పరిచయ వాక్యాలు పలికాడు.

స్వామిజీ నాగరాజు వైపు చూచి చిరునవ్వుతో తల పంకించాడు. నాగరాజు ప్రారంభించాడు : ''కాలం మారుతుంది. అంటే పరిస్థితులు మారుతాయి. సత్యాన్ని దర్శించే మార్గాల్లోనూ భేదం వుండాలి. జీవన వేగం పూర్వం, నలభై ఏభై ఏళ్లప్పుడు కూడా, యింత తీవ్రంగా వుండేది కాదనిపిస్తుంది నాకు. అందువల్ల ఏదైనా సామాజికమైన విశ్వాసాలూ, ఆదర్శాలూ వున్నాయంటే వాటిని వ్యక్తి జీవితంలో ఆచరణలో పెట్టే అవకాశం వుండేది. ఇప్పుడు అటువంటి అవకాశం తక్కువ. కారణం సామాజికమైన ఆదర్శాలు సంకీర్ణంగా వున్నాయి; తొందరగా మారుతున్నాయి; వ్యక్తి ఆచరణకు అందకుండా వున్నాయి. వ్యక్తుల్లో విచికిత్సా ఎక్కువై పోయింది. పూర్వం విశ్వాసాల ద్వారా జరిగే సాధనకూ, అనుభూతికీ పరీక్షా సమయం నిదానంగా వచ్చేది; వ్యక్తిలో అనుభవమూ వివేకమూ పరిణతి చెందిన తర్వాత, వయస్సు పైబడి ముసలితనం వచ్చిన తర్వాత; అప్పుడు లౌకికమైన జీవితం నుంచీ విముక్తి వెలుగులోకి—ఆ వెలుగుని దర్శించాక మళ్లీ జీవితంతో వాళ్లకు సంబంధం వుండేది కాదు! రెండో రకం వారు కొందరు పిన్న వయసులోనే జీవితం మీద ఆసక్తి లేక సమాజానికి దూరంగా వెళ్లి యోగ సాధన ద్వారా విముక్తి మార్గం అన్వేషించేవారు. అలాంటి వాళ్లు మళ్లీ జీవితంలో సంబంధం పెట్టుకున్నా అది కేవలం లాంఛనప్రాయంగానో, లేకపోతే లోకసంగ్రహణార్థమో వుండేది. జీవితంనుంచీ పొందవలసిన అనుభూతినీ, ఆనందాన్నీ అలాంటివా రాశించేవాళ్లు కాదు. పోతే మూడో రకం వారు కర్మయోగులనీ, రాజర్షులనీ జీవితంలో సంబంధం వుండగానే సత్యదర్శనం చేసినవారు. ఈ మూడు రకాల్లో కనిపిస్తున్న దొక్కటే ముఖ్య విశేషం—జీవితానుభూతి సత్యం కాదు. పరిపూర్ణమైనది కాదు; అది మాయ; అది దుఃఖ భూయిష్ఠం—దానికి అవతలి గట్టున పరిపూర్ణమైన ఆనందం, నిశ్చలత్వం శాశ్వతమైన అస్తిత్వం వుందన్న సిద్ధాంతం. అంటే 'జీవితం' ప్రకృతి అనీ క్షేత్రమనీ, 'ఆత్మ' పురుషుడనీ, క్షేత్రజ్ఞుడనీ విభాగం. ఇలా విభాగం చెయ్యటంలో రెండింటి సంబంధమూ నిర్వచించవలసిన కష్టం వుంది; అందువల్ల ఆత్మ జ్ఞానమంటే సాధన చేస్తూ కర్మ చేస్తూ నిర్లిప్తుడుగా వుండటం; కర్మ ఫలాపేక్ష లేనివాడుగా వుండటం వగైరా వూహకు అసంభావ్యంగా, అనుభవానికి అసాధ్యంగా కనిపించే భావాల్తో ఆ నిర్వచనం చెయ్యవలసి వచ్చింది. ఇది సుబోధకంగా లేక పోవటంవల్లనే కాబోలు బుద్ధుడు ఆత్మ అనేది వేరుగా లేదనీ, సత్కర్మ ద్వారా సద్విశ్వాసాల ద్వారా అంటే నైతిక సూత్రాల ద్వారా, వాంఛలను అధిగమించట మొక్కటే జీవితపు అనుభవంలోని దుఃఖం నుంచీ దోషం నుంచీ విముక్తి అనీ అదే నిర్వాణమనీ తన మతాన్ని బోధించాడు. ఏది ఏలా వున్నా మారే 'జీవితం' వేరు, నిశ్చలమైన వీక్షించటం ద్వారా జీవితానుభవం యిచ్చే ఆనందం తప్ప, దానికి అతీతమైన ఆనందానికి మీరు వెలి అవుతున్నారని తోస్తుంది...''

''నేను సామాన్యుణ్ణి అనే విషయం విస్మరించకండి. మీలో వున్న భావనా శక్తి, స్వప్న దర్శనాశక్తి నాలో లేవు. నాలాగే చాలమందిలో వుండవు.....ఒక స్త్రీని, నేను, శ్రీధర్ పద్మమణిని ప్రేమించినట్లు ప్రేమించగలనా?......''

''నీకున్న మేధాశక్తి, తార్కికశక్తి మాత్రం ఎందరికుంటుంది?'' అన్నాడు శ్రీధర్.

ఆత్మానందస్వామి నవ్వుతూ, "మిస్టర్ రాజ్....మీరు క్రొత్త యుగపువారే అని అంగీకరిస్తాను......కాని మీ ద్వారా 'గీత' ప్రాతబడిపోదు; క్రొత్త వెలుగులో దర్శన మిస్తుంది, అంతే!"

"ఇదే మన దేశపు తత్త్వ జిజ్ఞాసలో వుండే లోపం. ఏది క్రొత్తది చెప్పినా, ఇదంతా 'గీత' లోనూ, ఉపనిషత్తుల్లోనూ వుందని చప్పరించేస్తారు. దానితో ఆ భావాలకు స్వస్తి; ప్రజలలో సోమరితనం! నా భావాలకూ 'గీత' కూ సంబంధం లేదనే వాదిస్తాను నేను" అన్నాడు నాగరాజు కొంత ఆవేశంతో.

"గీతతో సంబంధం లేదంటే ప్రజలు పాశ్చాత్య భావాలుగా అసలు తిరస్కరిస్తారేమో, జాగ్రత్త సుమండీ!" అన్నారు స్వామిజీ నవ్వుతూ.

*　　　*　　　*

నాగరాజు వెళ్ళిపోయాడు జీవితంలోకీ, రాచకీయాల్లోకీ—శ్రీధర్ చెరువు గట్టున శూన్యాకాశాన్ని చూస్తూ కూర్చున్నాడు.

ఆత్మానందస్వామి చెప్పిన దానినీ నాగరాజు చెప్పిన దానినీ పోల్చి చూచుకుంటున్నాడు. స్వామిజీ వ్యాఖ్యానం ప్రకారం తను జీవితానికి అవతలి గట్టును చేరుకున్న పద్మమణితోటి జీవిత స్మృతినే ఆదర్శంగా ఆధారంగా లోకాతీతమైన సత్యాన్నీ, వెలుగునీ అన్వేషించాలి! ఇది శేషాద్రిగారి జీవితానికి కేవలం అనుకరణ కాదా? శేషాద్రిగారు భార్యను పోగొట్టుకొని అవతలి ఒడ్డుకు చేరుకున్న ఆమె కోసం పడ్డ ఆవేదనా, చేసిన అన్వేషణా జ్ఞాపకం వచ్చింది శ్రీధర్‌కు. చివరకు ఆయన స్వప్నం భంగం కావటం ఆయన కౌమార్తె లేచిపోవటం ద్వారా జరిగింది! ఒక్కొక్కరి జీవితమూ ఎంత డొంక తిరుగుడుగా, ఎన్ని విచిత్రాలతో హాస్యాస్పదంగా కూడా వుంటుందో! నాగరాజు సిద్ధాంతం ప్రకారం, సలహా ప్రకారం, పద్మమణి తోడి తన జీవితం ఒక అధ్యాయం మాత్రమే! అది ముగిసింది.....ఆ అనుభూతి ఎంత అలౌకిక స్వప్నమైనా అది యిప్పుడు ఒక స్మృతి మాత్రమే! దానికంటె ప్రస్తుతం తను అనుభవిస్తున్న శూన్యమూ, నిస్పృహా తన ఆత్మ నిజ స్వరూపాన్ని వ్యక్తం చేస్తాయి అని హెచ్చరించాడు నాగరాజు. ఈ క్రొత్త అనుభూతే తనుగా, తన ఆత్మగా అంగీకరించాలి! నాగరాజు వాదంలో ఎంత శక్తి వుంది! కాని తన నిర్ణయం ఆత్మానందస్వామినీ, నాగరాజునీ త్రాసులో తూచటం ద్వారా జరగ కూడదు. అది తన నిర్ణయంగానే ఉండాలి.

తను మారాలి, జీవితాన్ని అనుభవించాలి అన్న వాంఛ తనలో బలవత్తరంగా ఉంది. ఆ వాంఛ మూలంగానే మళ్ళీ మళ్ళీ పద్మమణి యిచ్చిన అనుభూతిని జీవితం యిస్తుందేమోనని ఆశ పడటం, ఎదురు చూడటం జరుగుతోంది! ఇది వ్యర్థమే! దేనికోసమో ఎదురు చూడటం జీవించటం కాదు; ఈ క్షణంలో యిప్పుడు తను జీవితాన్ని నిరాకరించటమే అవుతుంది! జీవితాన్ని నిరాకరించటం కంటె ఆత్మహత్య, వ్యక్తిత్వాన్ని చంపుకునే పిరికితనం వుండబోదని నాగరాజు సిద్ధాంతము. జీవితం ప్రసాదించే అనుభూతి ఏదో దాన్ని అంగీకరిస్తూ మార్పు వచ్చినప్పుడు క్రొత్త అను భూతిని కూడా అలానే అంగీకరించడం కంటె భగవంతునికి వ్యక్తి చేసే ఆత్మార్పణ ఏముంటుంది? అంతకంటె అహంకార రాహిత్యం ఏమి వుంటుంది? గీతలో చెప్పిన కర్మ యోగం కూడా యిదే కదా! సర్వ ధర్మ పరిత్యాజ్యమూ యిదే కదా? జీవితానికి నాగరాజు యిచ్చిన విలువలో, జీవితాన్నీ ఆత్మనూ భగవంతుణ్ణీ ఒకటి చెయ్యటంలో, ఎంత పరమార్థం యిమిడి వుంది!

ఆత్మానందస్వామి, నాగరాజు యిద్దరూ యోగులే! కాని నాగరాజు క్రొత్త యుగానికి చెందినవాడు; అతని దృష్టీ అనుభవం యీ యుగం వారికి పనికి వచ్చినంతగా స్వామిజీ జీవితం పనికి రాదు!

అయితే తను జీవితాన్ని ఏవిధంగా స్వీకరించాలి?

శ్రీధర్ గత జీవితాన్ని పర్యాలోకించాడు. తారనూ, తార తల్లి దండ్రులనూ తను ఏ దృష్టితో చూశాడు? రుక్మిణమ్మ వదినె అనే ఆదర్శం ద్వారా, శేషాద్రిగారి కవితా స్వప్నం ద్వారా, గాంధీగారి నిరాడంబరత్వం, సత్య దీక్షల ద్వారా వాళ్లను చూచి, విమర్శించి, దూరంగా మసలుకున్నాడు. అక్కడినుంచే జీవితాన్ని నిరాకరిస్తూ వచ్చాడు. జీవిత నగ్న స్వరూపాన్ని ఆవిష్కరించిన నాగరాజుని ఆనాడు ఏవగించుకున్నాడు; వంద రూపాయిల్ని కలుషితమైన ధనంగా తుచ్ఛంగా చూచాడు. అందుకే జీవితం తనని ఒక ఆట ఆడించింది. చంద్రావతి, శేషాద్రి తనకు జీవితాన్ని గురించి బోధించారు; జీవితమే పద్మమణి వేషంలో తనతో క్రీడించింది; మాయతో మాయమైంది—ఇది రాస లీల; తను గోపిక, జీవితం కృష్ణుడు. ఈసారి కృష్ణుడు ఏ రూపంలో వచ్చినా తను గుర్తు పట్టెయ్యగలడు! కాదు, కృష్ణుడు తనతో తన హృదయంలో ఈ క్షణం వేణుగానం చేస్తున్నాడు...... తను దేనికోసం వేచి వుండటం?

మరుసటి రోజు శ్రీధర్ చదువులో వెనుకబడిన నలుగుర్ని బీద విద్యార్థుల్ని తన గదికి రమ్మన్నాడు ట్యూషన్ చెప్పుకునేందుకు. కల్చర్ క్లబ్‌కి వెళ్లి క్రొత్తగా వచ్చిన పుస్తకాల్ని తెచ్చుకున్నాడు చదువుకునేందుకు......

రుక్మిణమ్మ వదినెని చూడటానికి వెళ్లాడు. ఈమధ్య సంవత్సరాల్లో కొన్ని సార్లు వెళ్లినా ఆమె శ్రీధర్‌తో మాట్లాడ లేదు. అతను మాట్లాడటానికి ప్రయత్నం చేస్తే రామగోపాల్ ద్వారా క్లుప్తంగా సమాధానాలు చెప్పించింది. పద్మమణి మృతి తర్వాత శ్రీధర్ ఎవరితోనూ మాట్లాడటమే మానేశాడు. రుక్మిణమ్మ వదినె మాట్లాడదేమో అన్న సందేహం బాధిస్తున్నా వెళ్లాడు. ఆమె అతణ్ణి చూచి "ఎంత చిక్కిపోయావు...... ఎలా అయిపోయావయ్యా?" అంటూ దుఃఖం ఆపుకోలేక పోయింది. చివరకు తను వచ్చిన పని చెప్పాడు : "అన్నయ్యనే నా పొలం చెయ్యమని చెప్పు వదినా! నాకు ఓబయ్యమామ ఏమీ ముట్టజెప్పటం లేదు!" "అయితే వెళ్లి తారను తీసుకు రారాదా?" అన్నది రుక్మిణమ్మ. శ్రీధర్ సమాధానం చెప్పకుండా లేచి పోయాడు.

ఓబయ్య దగ్గరకు స్వయంగా వెళ్లకుండా కబురుపెట్టాడు శ్రీధర్. ఓబయ్య రాలేదు. తర్వాత వ్రాతమూలకంగా ఈసారితో కౌలు పూర్తి అవుతుందనీ, యికమీద తన పొలాలు అన్నయ్యే చేస్తాడనీ తెలియజేశాడు. ఓబయ్య పరుగెత్తుకుంటూవచ్చి, "విశ్వాస ఘాతకుడా, నాకు చీటీలు వ్రాస్తావా? నేను చేసిన మేలు మరచి పోయావా?......అవును, నువ్వు ఆ తండ్రి కొడుకువే ఆ అన్న తమ్ముడివే. అనే సంగతి మరచి పోయాను!" అంటూ గోల పెట్టాడు. "మామా నీ ఋణాలు ఏ స్థితిలో ఉన్నాయి...... నువ్వెంత వ్యవసాయం చేసినా అవి పెరుగుతూనే ఉంటాయి, నాకు మిగిలేదీ వుండదు.....కాబట్టి నీకు శ్రమ ఎందుకు? నీ పొలాల్ని చేసుకో, చాల్లే" అన్నాడు.......

వెంకయ్యగారు పోయారు. మురళీ టెలిగ్రాం యిచ్చాడు శ్రీధర్ బందరు వెళ్లాడు. పెద్దదినం దాకా అక్కడే వున్నాడు. తర్వాత తారనూ, పిల్లల్నీ వెంటబెట్టుకుని తిరిగి వచ్చాడు......

ఆ రోజు దీపావళి.....చైనావాళ్లు ఉత్తర సరిహద్దులో పెద్ద ఎత్తున దాడి జరుపుతున్నారు. ఊళ్లో బాణా సంచా కాల్చటం లేదు ఎవరూ. దేశానికి కలిగిన ఆకస్మిక విపత్తు దృష్ట్యా అందరూ మానివేశారు. దేశ రక్షణకు విరాళాలు పోగు చేస్తున్నారు. చైనావారి ద్రోహం సంగతే అందరూ మాట్లాడుతున్నారు. దేశ చరిత్రలో ఒక క్రొత్త అధ్యాయం ప్రారంభం అయింది.

దేశం యిన్నాళ్లూ ఒక ఆదర్శ భావనలో, ఒక స్వప్న జగత్తులో, వాస్తవికతతో సంబంధం లేకుండా, అలీనంగా నిర్లిప్తంగా వుంది. చైనా దాడితో దేశానికి వాస్తవికతతో జీవితంతో సంబంధం కలిగింది......

శ్రీధర్ దీపాలు పెట్టాక యింటికి తిరిగి వస్తున్నాడు. అసుర సంధ్య తర్వాత అమావాస్య ఆకాశం అంధకారావృతంగానే వున్నా, యింటింటా ప్రమిదెల్లో దీపాలు మిణుకు మిణుకు మంటున్నాయి—ఒక్కొక్క దీపం మేలుకొన్న ప్రజ్వరిల్లుతున్న ఒక్కో వ్యక్తిత్వంలా ఉంది......

స్వరాజ్యం పోదూ? గాంధీ మరణించినా పోలేదు......
చైనా దాడి చేసినా పోదు!

స మా ప్తం

